# కోర్టుమార్షల్

[కథానిక]

✽

— శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న —

అప్పటికి అప్పుడే పదకొండు దాటింది. ఎడారి యెండ ; చెమటపొయ్యేదు. పొయ్యిలో పెట్టిన రొట్టెలాగ లోలోపలే ఉడికించివేస్తుంది. అపరిమితమయిన దాహం. కాల్చిన సూదుల్లాగ యిసకరేణువులు చుర్రుమని ముఖాన్ని తాకి, లోనున్న తాపాన్ని మరీ యినుమడింపజేస్తున్నాయి. దిక్కుమాలిన స్పీడిబేకరు. లారీ అంతా యినుపమయం ; దానికి తోడు ఆస్పీడుకి యిరుప్రక్కలనుంచీ కొలిమితిత్తులలోనుంచి ఊదినట్టు వేడిగాలుపు. ఆ సరికి అప్పుడే నాకు చెవులు ఘడియలు వేసుకుపోయి, మొహం తిరగడానికి సిద్ధంగా వుంది. వాటరుబాటులులో ఒక్క చుక్కయినా మిగుల లేదు. టోపీక్రింద బుర్ర బరువుగా సీసంముద్దలాగ అనిపిస్తోంది ; అలాగని ఆ టోపీ తీసెయ్యడానికి వీలు లేదు. తల దిమ్మెక్కిపోతోంది. ఎటు వెళుతున్నానో, ఎలా వెళుతున్నానో తెలియడం లేదు. అంతా నిర్మానుష్యమయిన ఎడారికనక, ఏక్సిడెంట్సు కలుగుతాయన్న భీతిమాత్రం లేదు. నా యంత్రంతోపాటు నేనూ యంత్రవతుగానే సాగిపోతున్నాను. సహవాసదోషేణ గుణా భవంతి!

ఇంక నాలుగుఫర్లాంగులు పోతే ఒక 'ఒయాసిస్సు' (Oasis) దగ్గిరవుంది సిబ్బందికేంద్రస్థానం. అదే గమ్యస్థానం. ఒంటిగంటలోపల వెళ్లి ఛార్జీపుచ్చుకోవాలి. మేజర్లో కాలనియతి పాటించకపోతే యిక ఫౌజుని ఏమని ఏం ప్రయోజనం? కొంచెం స్పీడు హెచ్చించేను. మకామ్‌కి అదరినున్న బారకాసుల సమీపంలోకి వచ్చేసరికి, కుడిప్రక్క ముందుచక్రం అటూ యిటూ అల్లల్లాడి, బ్రేకు వేసేలోగా ఎదరికి తూలిపోయింది. అయిదుటన్నుల లారీ యేమో, అమాంతంగా గొడ్డుపలుపులు తప్పిన బండీలాగ, ముందుకు వొరిగి పడిపోయింది. నా అవస్థకి నాకే జాలివేసింది. కాని ఏం చెయ్యను? సీటుక్రింద 'జాక్' ఎక్కపీకి లారీని పొజిషన్‌లో వుంచి, చక్రాన్ని ముందు యిరుసుకి అతికేను. స్ప్రింగుబుష్‌లు సరిచెయ్యడానికి లారీక్రింద దూరేసరికి, కాలిన యిసకలో శరీరం చుర్రుమని, ఒక్క గంతులో బయటకు వచ్చేసి, సీటుదిండ్లు క్రింద వేసుకుని మళ్లీ ఆరంభించేను మరామత్తుకి. అయినా కాలిన పెనంమీద పడుకున్నట్టే అనిపించింది. పట్టుకున్న యినపరెంచిమూలాన్ని అరచెయ్యి బొబ్బలెక్కింది. యెలాగో పనిముగించుకుని లారీ స్టార్టుచేసే వేళకి, బారెక్సుతీగలదగ్గరగా ఆ మండుటెండలో ఒక యిరవైయేళ్ల కుర్రాడు, చొక్కా అయినా లేకుండా, కొయ్యలు పాతుతూ కనబడ్డాడు. అతని శరీరం బాగా కమిలిపోయివుంది. పరకాయించి చూచేను. అది పటాలంలో శిక్షలు అనుభవించేవాళ్లు వుండే బారకాసు. అంత కఠినశిక్ష విధించిన రాతిగుండెల రాక్షసి యెవరు చెప్మా అని విస్తుపోయేను. అటువంటి క్రూరశిక్ష పాలు కావడానికి అతను ఏం నేరం చేసేడో?

లారీ స్టార్టుఅయిన అలజడికి కాబోలు, ఆ కుర్రవాడు తలయెత్తి నావంక పరిశీలనగా చూసేడు. అతను యింకా అలా చూస్తూవుండగానే వాహనం శరవేగంగా పరుగెత్తిపోయింది.

౨

సాయంత్రం ఏడున్నర అవుతుంది. గుడారం బయట మేజామీద టీ, బిస్కట్లూ, డబ్బాపళ్లూ పెట్టుకుని తింటూ, రేడియోవర్తమానాలప్రకారం ప్రోగ్రాములు వేసుకుంటూ కూర్చున్నాను. ఒక జమేదారు వచ్చి సెల్యూట్ చేసి మర్నాటి కార్యక్రమం యిచ్చేడు. మొట్టమొదటి అయిటెం ఒక హవల్దారు క్లౌర్టుకోర్టు మార్షలు! ఏమిశిక్ష విధించవలసివస్తుందో. ఏమిరా భగవంతుడా, ఛార్జీ పుచ్చుకోగానే యిటువంటి పని తగిలిందీ అనుకున్నాను. తల అమ్ముకున్నతరవాత తప్పతుందా?

పదినిమిషాలు అలాగే సిగరెట్టు కాలుస్తూ ఉండిపోయినాను. ఆనెంబరు—2490526—కళ్లకి కట్టినట్టుగా వుంది. ఆవిషయం ఎంత మరిచిపోదామనుకున్నా మరుపురావడం లేదు. ఎందుకు మనస్సు అలా పీకులాడుతోందో వూహించుకోలేకపోయినాను. ఇంతలోకే షోహరాబ్-రుస్తుములకథ జ్ఞాపకంవచ్చి గుండె గుభేల్మంది. ఎందుకయినా మంచిదని ఆనెంబరు గల ఆసామీపేరు చూడమన్నాను గుమస్తాని పిలిచి. నా సన్నిహితబంధువే. మా జగ్గుడు! అతన్నే నా ఏవిటి చెప్మా నిన్న ప్రొద్దున్న బేరెక్సులో చూసేనూ? కాని మావాడు • అంత నల్లగా వుండడే. ఏమో, యీ మిలిటరీవుద్యోగంలో చేరి, హితవయిన తిండీ తిప్పలూ లేక, ఎడారియెండల్లో బాధలుపడుతూ అలా అయిపోయేడేమో!

జగ్గుడు! వాడి పరిస్థితులు తలుచుకుంటే ఎంత శిలామయమయిన హృదయమయినా ద్రవించి దయామయ మయిపోకమానదు. వాళ్లు బహు శ్రీమంతులు అవడంచేతా, జగ్గుడి నాన్నగారు ముగ్గురు అన్నదమ్ములలోకీ పెద్దవాడు అవడంచేతా అతిగారాబంగా పెరిగేడు. తండ్రిపోయినకారణంగా ఆయన చిన్నతనంలోనే చదువులు చాలించుకున్నప్పటికీ, యిద్దరుతమ్ముళ్లకీ చదువులుచెప్పించి, పెళ్లిళ్లు చేసి, సిగపువ్వు వాడకుండా పెంచుకువచ్చి తండ్రిలేని కొఅత తీర్చేడు. కొంతకాలం బాగానే జరిగింది. ఇద్దరుతమ్ములూ చేతికి అందుకువచ్చేరు; యిద్దరూ డాక్టర్లే. కాస్త పేరు కూడా సంపాదించుకుంటూ వుండడంవల్ల నిజంగా జగ్గుడునాన్నగారికి ఆ తమ్ములని చూస్తే కొండ అందుకున్నట్టుండేది. ఆస్తి పంచేసుకుని వాళ్లు కేటాయింపు అయిపోయినారన్న సంగతి లోకానికి తెలియదంటే, ఆ అన్నదమ్ములు ఎంత అన్యోన్యంగా వుండేవారో వూహించుకోవచ్చు. ఇంతకూ యిద్దరుతమ్ముల ప్రాక్టీసూ, పలుకుబడీ బాగుండేవి. జగ్గుడునాన్నగారిది మొదటినుంచీ దర్జాజీవితమే. వొచ్చీపోయేవాళ్లతోనూ, వాళ్ల మర్యాదలతోనూ, విందులతోనూ, సంతర్పణలతోనూ ఎప్పుడూ నిత్యకల్యాణం పచ్చతోరణంగా వుండేది జగ్గుడునాన్నగారి యిల్లు; ముఖ్యంగా యీ యన్నే ఎందుకు చెప్పాలీ అంటే, యింటిపెద్దకనక అభం శుభం అన్నీ యీయననెత్తినే పడుతూవుండేవి. దానికితోడు కాస్త భారీచెయ్యి అవడంవల్ల అవసరానవసరాలతో ప్రమేయం లేకుండానే ఖర్చులూ తగులుకుంటూ ఉండేవి.

స్వార్జితం అనేది లేకపోయినతరవాత, మార్చుకు తింటూఉంటే ఎంతకాలం వస్తుందీ? ఒకదశ తిరిగేటప్పటికి ఆయనదశ మారిపోతూన్నట్టు అవుపించింది. ఒకటిరెండుసార్లు యీయన రెండుమూడు సంచులు అప్పుచేసేడని తెలిసి, మరదళ్లలో మనోవికారాలు పొడగట్టేయని అంటారు. అయినా అన్నదమ్ముల సౌజన్యానికి ఏమీ లోటురాలేదు. ఏదో మారుమూల మడిచెక్క కరారాఁవుడి చుట్టుకుపోయినా రాజసంమాత్రం యథాప్రకారంగానే బావుటాయెగిరించేది. మరొక్క నాలుగేళ్లు పోయేసరికి, చదువుకోవలసిన ముగ్గురు మొగపిల్లలమాటా అలా వుంచగా, ఎదిగిన ఆడపిల్లలు యిద్దరూ యింట్లో మెసులుతూవుండడం కొంచెం గుండెలమీద కుంపటిగా తోచింది. పిల్లలయితే కుందనపుబొమ్మలే. అయితే మాత్రం కట్నాలు యివ్వకుండా కళ్యాణాలు కలిసొస్తాయా? అప్పటికి అప్పుడే అప్పులపా లయిపోతున్నాడన్న అప్రతిష్ఠ గాఢంగా అలుముకుంటోంది.

ఇంతలోకే యుద్ధం వచ్చిపడింది. హిట్లరు యూరపుదేశాలని వరసగా ఆక్రమించుకుంటూన్న

రోజులు. అశురాజ్యాలు ఐక్యమయి విజృంభించేస్తాయనీ, భారత దేశానికి పెనుప్రళయం రానున్నదనీ అపోహపడిన కాలం అది. జగ్గడునాన్నగారికి పూర్తిగా కలికాలంగా పరిణమించింది. అప్పులవారి పోరు పడలేక ఉన్నదల్లా తెగనమ్మేశు; దాంతో ఆయనపరువు బొత్తిగా వీధినిపడిపోయింది. సేలం జరీధోవతులు, పెద్దాపురం పట్టుకోట్లు ముతకఖద్దరుకి దారిచూపగా, కత్తిరమార్కు సిగరెట్టు కాకీయూనిఫారం ధరించి బీడీరూపకంగా ఆసరాఅయి నిలిచింది ఆయనకి. తన పిల్లలయినా చేతికి అందుకు వస్తారేమో నంటే యిద్దరు పెద్దవాళ్ళూ మూడేసి ఏళ్లు స్కూలుఫైనలు వెలిగించి, యిహ చదువులకి పనికిరాకుండా పోయేరు. యిరవైయ్యేసి ఏళ్లు ఉన్నా ఆసరికి ఒక్కడి మెడలోనూ జంధ్యప్పోచ పడలేదు. కాగా పధ్ధెనిమిదేళ్ల పెద్దపిల్ల. ఆమె మనస్సులో పరిపరివిధాల కుమిలిపోయినా, తండ్రికి విచారం కలిగించకుండావుండాలని పైకిమాత్రం నిండుకుండలాగ ప్రవర్తించడంతోటే, ఆమెసౌశీల్యాన్ని చూచినకొద్దీ జగ్గడునాన్నగారికి ఆవేదన అపరిమితం అయిపోయింది.

ఇంతలోకే ఒక తమ్ముడు హఠాత్తుగా మరణించేడు. రెండో తమ్ముడికి స్వకుటుంబభారం అధికం అవడంవల్లనో మరేకారణంచేతనో, సర్దుబాటు చెయ్యడానికి అవకాశం తప్పింది. కాకపోయినా, ఒక యావత్తు కుటుంబాన్ని యింకో కుటుంబీకుడు ఎంత కాలమని పోషించగలడు? తీరా చేస్తూవుంటే ఎలాగో సరిపుచ్చుకోడానికి బదులు 'పుణ్యానికి పెట్టినమ్మా నీమొగుడితో సమానంగా పెట్టవమ్మా' అన్నట్టువుంటాయి ఆడవాళ్ల మనోభావాలు. ఉన్నవూళ్లో యింక తలయెత్తుకు తిరగలేక, మకాం యెత్తేసేడు ఆయన. బెజవాడ, బందరు, మదరాసు అన్నీ చూడడం అయింది. కాటికి కాలు జాచుకొని వున్నవాడికి వుద్యోగం యెవరిస్తారు ? యింతకూ చెప్పుకోతగ్గ ఉద్యోగం చెయ్యడానికి ఆ లైనులో యీాయనకే వున్న అనుభవం ఎంత ? నానాటికీ పరిస్థితులు మరీ దుర్భరం అయిపోతున్నాయన్న సంగతి జగ్గడూ, వాళ్ల అన్నయ్యా గమనిస్తూనేవున్నారు. అడ్డమయినవాళ్ల కాళ్లూ పట్టుకుంటూనే వున్నారు నౌఖరీలకోసం ; కాని చదువులకి బాలారిష్టదోషం పట్టడంమూలాన్ని ఎక్కడా దారీ తెన్నూ కనిపించింది కాదు. ఒకనాడు వాళ్ల అమ్మా, పెద్దచెల్లీ ఉపోష్యం వుండి, తమ్ముడికీ, చిన్నచెల్లికీ అన్నంపెట్టడం కళ్లారా చూసేడు జగ్గడు. దాంతో వొళ్లు అంతా కైరులుపాకినట్టనిపించి, ఎవ్వరితోనూ చెప్పకుండా ఆ రాత్రే మద్రాసువెళ్లి మిలిటరీలో చేరిపోయేడు. నాటినుంచీ ప్రతీనెలా ముప్ఫైయ్యో, నలభైయ్యో యింటికి పంపుతూవుండేవాడు తప్పనిసరిగాను. కుచేలుడి సంతతిలోవాడూ, తన లోతుపాతులు యెరిగినవాడూ కనక ఉద్యోగంలో బహు మెలకువగా వుండేవాడు. రాకరాక వచ్చిన ఉద్యోగాన్ని నిలబెట్టుకుని వృద్ధిచేసుకుందామని వాడికి చాలా పట్టుదలగా వుండేది. ఆయా సంగతులు నాకు ఎడపాదడపా వచ్చిన రికార్డులలో తెలుస్తూవుండేవికూడాను. మరి అలాంటివాడికి యీ కోర్టుమార్షలు ఏమిటి చెప్మా ?

## 3

ఈ గతచరిత్ర అంతా సినీమాలో చూసినట్టు ఆ అరఘంటలోనూ దృగ్గోచరమయ్యేసరికి నాకు మరీ వుండబట్టిందికాదు ; అలాగని పనికట్టుకుని బారెక్సుకి వెళ్లి మనిషితో మాట్లాడి గుండుగొమ్ముల అనుమానం తీర్చేసుకుందామంటే—పైస్థలం ; ఎంత తాబేదారులయినా వున్నవాళ్లంతా పంజాబీవాళ్లు. ఎవడైనా ఏదైనా రూమరు పుట్టించిపోయేడంటే, వైర్లెస్‌కన్నా త్వరగా అది ఢిల్లీ చేరుకోవడం అలావుంచగా, నాకే యెసరువచ్చి మొదటికే మోసం కలగవచ్చు. వెంటనే జర్గవలసిన ఉపకారం జరగదుసరేకదా, యింక యెన్నడూ యెవ్వరికీ ఏ సదుపాయమూ చెయ్యలేని పరిస్థితులు ఏర్పడవచ్చు.

ఆ రాత్రి నాకు నిద్దరపట్టలేదు. ఏ రెండుగంటలకో మాగన్నుపడిందేమో. మామూలుగా నాలుగున్నరకల్లా తెలివివొచ్చేసింది. ఆహ్నికాలు తీర్చుకుని, కాఫీ పుచ్చుకుంటూవుండగా చిన్న వుపాయం తట్టింది. క్రొత్తగా ఛార్జిపుచ్చుకున్నవాణ్ణి కనక నా క్రింద

యెటువంటి మనుషులు వున్నారో, ఎవరిని ఎంతవరకూ నమ్మవచ్చునో తెలుసుకోవడం ఆవశ్యకమన్న నెపంతో ఒక్కొక్కడి విషయం ఆరాతియ్యడం ఆరంభించేను. ఆ దెబ్బతో జగ్గుడుగాడి వివరాలు చాలా తెలిసేయి. పాపం. మొదట్లో సిపాయిగా ప్రవేశించి, రెణ్ణెల్లు తిరగకుండానే హావల్దారుక్లార్కుగా ప్రమోషనుపొందేడు. మరొక్కయేడు తిరిగేటప్పటికి మూడో గ్రేడులోంచి మొదటిగ్రేడులోకి డబుల్ ప్రమోషనుగూడా సంపాదించుకున్నాడు. వీడి పని చూచిన ప్రతీ ఆఫీసరూ మంచే వ్రాసేడు. ఎక్కడా చెడుగులేదు—ఆ వేళ జరగనున్న కోర్టుమార్షలుతప్ప.

ఇదే మిలిటరీలో వుండే విశేషం. ఏసంగతీ మొత్తంగా చూడరు. మనిషితాలూకు ప్రవర్తన—నమ్మికలతో అసలే పనిలేదు. దీని కారణంకూడా లేకపోలేదు. ఇవాళ యిక్కడ వున్న ఆఫీసరు రేపు యింకోచోటికి బదిలీఅయిపోతాడు. దాంతో, వాడి మెహర్బానీ సంపాదిద్దామని చేసిన చాకిరీ అంతా బుగ్గి అయిపోతుంది అన్నమాట. వాడిస్థానే వచ్చినవాడు కర్కోటకుడే అవునో, కరుణామయుడే అవునో. యింతకూ ఆ వచ్చినవాడికి వీడియందు నమ్మిక కలగాలంటే కొంతకాలం పడుతుంది. అటువంటి సందర్భాలుకూడా జతపడొద్దూ? ఈలోగా ఏది ఎటునుంచి వచ్చినా గాలిలో దీపం పెట్టి 'దేవుడా నీదే భారం' అన్నట్టు అవుతుంది. అంచేతే యీక్షణంలో 'శహబాసు' అనిపించుకున్నవాడు ఉత్తరక్షణంలో ఓటికుండ అయి వూరుకుంటాడు. ఇదే ఏ సివిలుఉద్యోగమో అయితే అంత త్వరగా 'బ్లేకుమార్కు' పడుతుందా? అందులోనూ ఆదినుంచీ మంచిరికార్డు వున్నవాడికి పాటాపెట్టాలంటే ఎన్నిగుండెలు వుండాలి? కాని మిలిటరీలోమాత్రం యిటువంటివి బహుసామాన్యం. ఇవాళ కేప్టినుగా వున్నవాడు, ఓ చుక్క ఎక్కువసేవించి, ఒళ్లు తెలియక పై ఆఫీసరుకి సెల్యూటు చెయ్యకపోతే ఆసాయంత్రమే వాణ్ణి లెఫ్టినెంటుగా దింపేస్తారు. మళ్లీ నాలుగురోజులు వొళ్లుదాచుకోకుండా పనిచేసేడనేసరికి వాడే తిరిగీ కేప్టినో, లేకపోతే యింకా మేజరో అయిపోతాడు. ఫాక్తు మిలిటరీలో సంగతే యింత. కాని క్రొత్తగా మిలిటరీలో చేరినవాడికి యిటువంటి అసందర్భం ఏదైనా తటస్థిస్తే తలతీసేసినట్టుగా వుంటుంది. ఆఫీసర్లగతే యిలా గడ్డలయిపోతూవుంటే హావల్దారుక్లార్కులని చూచేదెవరు?

నాకు వొళ్లు కంపమెత్తిపోయింది. కుర్రనాగమ్మ పొరపాటుచేసేడే అనుకోండి; పూర్వాపరాలు చూడొద్దూ? ఆదినుంచీ అష్టకష్టాలు అనుభవించి, ఎలాగో ఒకఉపాధి సంపాదించి, సాటివారిలో 'ఓ' అనిపించుకుంటూ, తనవాళ్లంతా తనమీదనే ఆధారపడివున్నారన్న జ్ఞానంతో, తల్లిదండ్రుల ఋణం తీర్చుకుందామనే దృఢసంకల్పంతో, సునిశితంగా నాటుకుపోయిన ఆత్మప్రబోధంతో శ్రమిస్తూన్న మనిషి కాస్త పరాకు పడగానే—అది అయినా బుద్ధిపూర్వకంగా చేసిన తప్పిదంకాదు—దివ్యంగా వున్న పూర్వచరిత్ర అంతా విస్మృతం అయిపోవలసినదేనా? నిజంగా వొళ్లువొంచి పనిచేసేవాడికే అన్ని యిబ్బందులూను. ఇదే సహృదయుడయిన ఆఫీసరుహయాంలో అయితే యిలా జరుగుతుందా? పాపం. వాడికృషికీ, తత్ఫలితానికీ అమితానందగర్వాలని పొందుతూ తారాజువ్వలాగ తారాపథంలోకి జొచ్చుకుపోవలసిన తేజోమూర్తిని, నాలుగుగోడలమధ్యా బంధించి, సరియైన తిండి పెట్టక, ఆ ఎడారిమంటు టెంటులో, పైన చొక్కా అయినా లేకుండా ఏకొయ్యలు పాతమనో, లొటిపిటలకి మాలీసుచెయ్యమనో నియోగించి, ఎందుకూ పనికిరాని వాణ్ణిగా మార్చివేసేరు. ఆ అమాయికహృదయం ఎన్నివిధాల విలపించి తపించిపోతున్నదో.

## ౪

ఇటువంటి పర్యాలోచనలతో ఎనిమిది గంటలదాకా తెలియకుండానే కాలం గడిచిపోయింది. బేరరు వచ్చి స్నానానికి లెమ్మన్నాడు. అభ్యంగనం, ఛోటాహాజ్రీ ముగించుకుని, తొమ్మిదింబావుకల్లా లైన్సుకి వెళ్లేను. నేనే అధ్యక్షుణ్ణి ఆ కోర్టు మార్షలుకి. ఇరుప్రక్కలా యిద్దరు కేప్టెనులు కూర్చున్నారు న్యాయపరిశీలనలో నాకు సహాయం చెయ్యడానికి. నేరస్థుడు ఎదురుగా నుంచుని సెల్యూటుచేసేడు. హెడ్

క్లార్కు చార్జిషీటు పుచ్చుకుని నేరం చదివేడు. నేరం, సర్కారు మిలిటరీలో వుండి కాన్వాయిని తీసుకువెళ్ళే సందర్భంలో కనబరచిన ప్రమత్తత. సందర్భాన్ని పరిశీలించడానికి ఆరంభించేం.

బర్మాయుద్ధం తీవ్రంగా సాగుతూ ఉన్నప్పుడు ఒకసారి అచటికి కొన్ని యుద్ధపరికరాలు పంపవలసిన ఆవశ్యకత కలిగింది. వ్యవహారం అర్జంటు అవడంచేతా, అందరిలోకీ జగ్గడియందు అప్పటున్న ఆఫీసరుకి మాంఛి గురిఉండడంచేతా, వీణ్ణి ఆ కాన్వాయిని తీసుకువెళ్లి కలకత్తాలో వప్పజెప్పడానికి నియోగించేరు. అహోరాత్రాలు నిద్రావిశ్రాంతులు లేకుండా ఏడు వందల మైళ్ళూ లారీలు నడిపించుకుని నెమ్మదిగా కలకత్తా పొలిమేర చేరుకున్నాడు బహుభద్రంగాను. ఇంక తన గమ్యస్థానం చేరుకుంటూ ఉండగా ఒక మద్రాసీ హోటలు కనిపించింది వీడికి. కష్టాలకి ఓర్చుకోలేని చిఱుతప్రాయం; అప్పటికి అప్పుడే మూడు రోజుల బట్టీ ఆత్మత్యాగం చేస్తూన్న వ్యక్తి; ఉదయం ఎనిమిది గంటల వేళ; మిగతా లారీడ్రైవర్లకి అందరికీ తను పస్తు వుంటూన్నా భోజనసదుపాయం చేసేనన్న ఆత్మజ్ఞానం. అటువంటి సందర్భంలో వీడికి కాస్త కాఫీపుచ్చుకుందామని మనస్సు పీకులాడింది అంటే అందులో ఆశ్చర్యం ఏమీ కనబడదు. "ఓస్, ఒక పావుగంట ఆలస్యం అయితేమాత్రం కలుసుకోలేకపోతానా, యింతకూ నాలారీ వొట్టిదేకదా" అన్న ధీమాతో హోటలులో జొరబడ్డాడు. ఇడ్లీ, దోసె, కాఫీ — అప్పటికి మూడేళ్లయి మొహంవాచి ఉన్నాట్ట వీటికోసం — పుచ్చుకొని బయటికి వచ్చేసరికి వీడి లారీ కనపడలేదు. మనిషికి ముచ్చెమటలు పోసిపోయినాయి. నిమిషాలు గతిస్తూన్న కొద్దీ నిలువునా నీరయిపోతున్నాడు. ఏమీ పాలుపోయింది కాదు. యింతలోకే హోటలువెనక గోడతట్టున యింకోలారీ — అదీ మూడు టన్నుల లారీయే, నల్ల టార్పాలినుతో వున్నదే — కనుపించగా, తనదే ఎవడో అక్కడ పెట్టేడన్న భావంలో పడి (అన్ని లారీలూ కవల పిల్లలలాగ వుంటాయి మిలిటరీలో), యింతకూ లారీ దొరికింది బ్రతుకుజీవుడా అని, ఒక్క ఊపున ఝామ్మని వెళ్లి కాన్వాయిని కలుసుకుని గమ్యస్థానం చేరుకున్నాడు జగ్గడు.

అక్కడ సెక్యూరిటీ ఆఫీసరు సామగ్రి అంతా లెక్కవప్పజెప్పుకుని, ఏడులారీలూ సక్రమంగా వచ్చేయని కాయితం సంతకంచేసి యిచ్చెయ్యడంతోనే తన అదృష్టానికి సంతోషిస్తూ లోపలికి పోయేడు వాడు టీ పుచ్చుకోడానికి.

మరొక్క పదినిమిషాలకి అమెరికన్ బేసుకేంపు నించి టెలిఫోనువచ్చింది. ఫలానా నెంబరు గల వాళ్ళ లారీ కనిపించడంలేదు కనుక, యిక్కడ వీళ్లవద్దనున్న లారీనెంబర్లు సరిమాసి, ప్రమాదవశాత్తూ అక్కడికి చేరుకుందేమో తెలియజెయ్యవలసిందంటూను. ఆవేళ మన వాడి కాన్వాయిలారీలు తప్ప యింకేవీ అచ్చటికి చేరుకోలేదు; యీసంగతి సెక్యూరిటీ ఆఫీసరుకి తెలుసును. ఫలానా కేంద్రంనుంచి వచ్చిన మా లారీలేగాని మావి యేవీ రాలేదని వెంటనే వర్తమానం చేసేద్దా మనుకున్నాడుగాని, ఎందుకయినా మంచిదని కాన్వాయి లారీనెంబర్లు తనిఖీచెయ్యడం ఆరంభించేడు. ఏయేనెంబరు లారీలు కాన్వాయిగా ఏర్పరిచేరో జగ్గడి గాడి డ్యూటీస్లిప్పులోనే వుంటుంది. సెక్యూరిటీ ఆఫీసరు మొదట్లో లారీల సంఖ్యమాత్రమే చూచేడు; నెంబర్లు తనిఖీచెయ్యలేదు. తీరా ఆపనికి పూనుకునేసరికి ఒక లారీనెంబరు భేదించింది. ఆ భేదించిన నెంబరూ, అమెరికన్ బేసుకేంపువాళ్లు యిచ్చిన నెంబరూ సరిపోయినాయి. సెక్యూరిటీ ఆఫీసరుకి తలాతోకా తెలియలేదు.

ఇంతలోకే ఒక అమెరికన్ ఆఫీసరుకూడా దిగబడ్డాడు, మూడుటన్నుల లారీ ఒకటి వేసుకుని. ఆశకటాన్ని చూడగానే జగ్గడి ప్రాణాలు నిలువునా ఎగిరిపోయినాయి. అయినా యింక చెయ్యగలిగింది ఏమీ లేదనుకుని గంభీరంగా వూరుకున్నాడు.

చూస్తూవుండగా ఆ అమెరికను తిన్నగా సెక్యూరిటీఆఫీసరువద్దకి వెళ్లి, "ఫలానాచోట కాఫీ పుచ్చుకుని బయలుదేరే సమయంలో మా లారీకి బదులుగా మీదాన్ని తీసుకుపోయినాను; కాస్తదూరం పోయేసరికి లారీలో పెట్టుకున్న నాసిగరెట్టుటిన్ను కని

పించలేదు. దానికోసం తడుముళ్లాడుతూ పరకాయించి చూసేసరికి బంపరుమీద నెంబరునిబట్టి యిది మీది అని తెలిసింది. తీసుకోండి. మాది ఫలానాలారీ గైరుహాజరు అయిపోయిందని మాకేంద్రస్థానానికి టెలిఫోనుచేసేను. ఈవ్యవహారంలో మీకు యేమయినా యిబ్బందికలిగితే మన్నించండి" అంటూ అతిపెద్దమనిషితరహాగా చెప్పేడు.

౫

ఈవాఙ్మూలం సెక్యూరిటీఆఫీసరు యిచ్చేడు. జగ్గడు వొప్పుకున్నాడు. అందులో వివరాలన్నీ నిజమేనని. మిలిటరీడ్యూటీలో ప్రమత్తతగా వున్నాడన్న నేరంమీద యింక శిక్షవిధించాలి. కథ అంతా విని మిగతా యిద్దరు మెంబర్ల ముఖాలూ చూసేను, వారి అభిప్రాయాన్ని ఆహ్వానిస్తూను. యిద్దరూ నేరాన్ని స్థిరపఱిచేరు.

నాకు వొళ్లు మండిపోయింది. "కేసు పరిష్కరించే సందర్భంలో వీళ్లు మూలకారణాన్ని ఎత్తుకోవడమే లేదు. వీడు డ్యూటీలో వుండగా దారిమధ్యస్థంలో ఎందుకు ఆగేడు అన్నది వేరేప్రశ్న. దాన్ని తరవాత ఎత్తుకుంటాను. ఆదిని నేను అడిగేది ఏమిటీ అంటే, జగ్గడు నిలిపిన లారీ ఆస్థలంలోంచి ఎందుకు కదలాలని అవతలవాడు ఆఫీసరు. జవాబుదారీ ఎక్కువవున్న వ్యక్తి. తన లారీ ఎక్కడవుంచేడో తనకే తెలియలేదూ? ఎదరగా వచ్చినవాడే పెళ్లికొడుకా? రేపు యింకోసంగతి జరిగినా యిలా పరిష్కరించబడవలసిందేనా? ఆ ఆఫీసరు ప్రమత్తప్రవర్తనకి ఏమి సంజాయిషీ వచ్చింది? అసలు యీప్రసక్తి అమెరికనువారితో ఎత్తుకున్నారా? లేకపోతే, ఎందుకు లేదు? ఆ లారీయే అక్కడ వుంటే యీగొడవే లేకుండును కదా!

"ఇహ కాగాపోగా, జగ్గడు హోటలుదగ్గర ఎందుకు పెర్మిషన్ లేకుండా ఆగేడూ అని. ఒకయూనిట్టు వొదిలి రెండోయూనిట్టు చేరుకోకముందు స్వయం రాజా స్వయం మంత్రీన్నీ. ఇంతకూ పెర్మిషన్ పుచ్చుకోడానికి అక్కడ మధ్యేమార్గంలో పై అధికారులు యెవరున్నారని? దురుద్దేశ్యం ఏమయినా కనిపించిందేమోనంటే, చెడుగు లేదు సరికదా, నిర్ణీత కాలానికి వస్తువులు గమ్యస్థానం చేరుకోవాలనే దృఢనిశ్చయంతో మిగతాలారీలని వాడు ఆపుచెయ్యలేదన్నది మెచ్చుకోవలసిన విషయం. పైగా, లారీ కనుక్కున్నాడని అనుకున్నవెంటనే రివ్వున పోయి వాటిని చేరుకుని భద్రత కనబరిచేడు. ఆ లారీ కనుక్కోవడంలో పొరపాటు జరిగిందని అంటారు. ముందుగా యింకొకర్ల వల్ల జరిగిన పొరబాటుకి యిది అనుబంధం అని నేనంటాను. వీడే ఆపాళంగా లారీపోయిందని ఫోనులో చెబితే యేమవును? దీర్ఘప్రయాణంలో కాన్వాయి ఏ ప్రదేశంలోనూ ఆగకూడదని రూల్సు వున్నాయా? అలా ఆగినప్పుడు యీప్రమాదం జరగడం అసంభవమా?"

అరఘంట మాట్లాడినా, ఇద్దరిలోనూ ఒక్కడూ ఉలకడు, పలకడు. కేసు కొట్టేసేను. ఈ రికార్డు పైకి వెళ్లిన పదిరోజుల్లో నాకు సింగపూరు బదిలీఅయిందని వార్త వచ్చింది. ఇద్దరు కెప్టెనులూ ముసిముసినవ్వులు నవ్వుకున్నారు. వీడ్కోలుసమయంలో సెల్యూటు తీసుకుని కరస్పర్శ చేస్తూ అన్నాను: "అక్కడా ఎవడో వుండివుంటాడు, నాచేతుల్లో శిక్షవిడుదలకావడానికి" అని. ఆకాశంలో నక్షత్రాల్లాగ వాళ్ల కళ్లు ఒక్కమారు మెరిసేయి. మన పటాలం మొహంమీద చిరునవ్వు చంద్రవంకయి వెలిసింది!